AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

బస్సు ప్రమాదాలతో కలవరం

2

2

లింబాద్రి గుట్ట హుండీ లెక్కింపు

టీబీ వ్యాధిగ్రస్తులకు అండగా నిలవాలి

అక్షరటుడే, ఇందూరు: టీబీ వ్యాధిగ్రస్తులకు రెడ్‌క్రాస్ సొసైటీ అండగా నిలవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఉత్తమ సేవలకు గాను కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ సొసైటీ ప్రతినిధులను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇటీవల గవర్నర్ జిల్లా పర్యటనలో కూడా టీబీ గురించి మాట్లాడినట్టు గుర్తు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అంకిత్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మనోహర్ రెడ్డి, రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, కోశాధికారి రవీందర్, కార్యదర్శి అరుణ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

24-7-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

రేపు లింగంపేటకు కేటీఆర్

అక్షరటుడే, ఎల్లారెడ్డి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆత్మ గౌరవ గర్జన సభలో పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి, మధ్యాహ్నం ఒంటి గంటకు లింగంపేట్‌కు చేరుకుని సభలో పాల్గొంటారు. అనంతరం. 2 గంటలకు దళిత నాయకుడు ముదాం సాయిలు కుటుంబాన్ని పరామర్శిస్తారు. అంతే కాకుండా పలు కార్యక్రమాల్లో పాల్గొని సాయంత్రం 5.30 గంటలకు తిరుగు పయనం అవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన నిరంతర ప్రక్రియ

అక్షరటుడే, ఇందల్వాయి: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన నిరంతర ప్రక్రియగా ఉండాలని తెయూ వీసీ ఎం యాదగిరి రావు అన్నారు. వర్సిటీ అర్థశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో 'ఎంపవరింగ్ ఇండియా 2047: స్ట్రాటజీస్ ఫర్ సస్టైనబుల్ డెవలప్మెంట్' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సెమినార్ గురువారం రెండో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా 1992లో 178 ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలు ఎర్త్ సమ్మిట్ నిర్వహించాయని తెలిపారు. అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సమ్మిట్ అభిప్రాయపడిందని గుర్తు చేశారు. ఇందులో భాగంగా ప్రపంచవ్యాప్తంగా 2000 సంవత్సరంలో మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్ ద్వారా పేదరికాన్ని 2015 నాటికి తగ్గించాలని నిర్దేశించుకున్నారన్నారు. ఇదే దిశలో భారతదేశంలో 2047 నాటికి సాధికారత గల దేశంగా ఎదగడానికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను నిర్ధారించుకుని, సాధించడానికి వ్యూహాలను ఏర్పాటు చేసుకోవా లన్నారు.

రెండురోజుల జాతీయ సెమినార్ విజయవంతంగా పూర్తి చేసిన విభాగం కన్వీనర్, ప్రొఫెసర్లను అభినందించారు. ముగింపు కార్యక్రమానికి గౌరవ అతిథులుగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు రాణి రత్నప్రభ, చిట్టేడు కృష్ణారెడ్డి, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆచార్యులు కే కృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా.. సరస్వతి, శ్రద్ధానందం, సౌందర్య, సిద్ధలక్ష్మి, సుజాత సంధాన కర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి, నాగరాజు పాత, స్వప్న, వివిధ వర్సిటీల ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు నెలల్లో ఐదవదైన శ్రావణం.. పరమ పవిత్ర మాసంగా పరిగణింపబడుతోంది. పౌర్ణమినాడు చంద్రుడు శ్రవణ నక్షత్రంలో సంచరించడం వల్ల ఈ మాసానికి శ్రావణమాసం అన్న పేరు వచ్చింది. ఇది ఆధ్యాత్మిక మాసం. ఈనెల రోజులు ప్రతి ఇల్లు ఆలయాన్ని తలపిస్తుంది. భగవన్నామస్మరణతో ఆలయాలు మార్మోగుతాయి. ఈ ఏడాది శ్రావణమాసం 25వ తేదీన ప్రారంభమవుతుంది. శివకేశవులిద్దరికీ ప్రీతికరమైన ఈ మాసం విశిష్టతలు తెలుసుకుందామా.. - అక్షరటుడే, ఇందూరు

శ్రావణం.. పరమ పవిత్రం

■ శివకేశవులకు ప్రీతికరమైన మాసం ■ రేపటి నుంచి ఉపవాసాలు ప్రారంభం

అమృతం కోసం దేవతలు, రాక్షసులు సముద్ర మథనం చేసినప్పుడు.. మొదట హాలాహలం వచ్చింది. సమస్త విశ్వాన్ని నాశనం చేసే శక్తి కలిగిన ఈ విషాన్ని శివుడు స్వీకరించి, గరళంలో నిలిపి గరళకంఠుడిగా మారారు. ఈ విషం వల్ల ఆయన గొంతు నీలం రంగులోకి మారడంతో ఆయన నీలకంఠుడయ్యాడు. ఇది శ్రావణ మాసంలో జరిగిందని పురాణాలు పేర్కొంటున్నాయి. అందుకే ఈ మాసాన్ని శివుడికి అంకితం చేశారు. శివ, కేశవ భేదం లేకుండా పూజించడానికి విశేషమైన మాసంగా శ్రావణాన్ని భావిస్తారు. ఈనెలలో చేసే ఏ దైవ కార్యమైనా అనేక రెట్లు శుభ ఫలితాన్నిస్తుందని భక్తులు నమ్ముతారు. సోమవారాల్లో శివారాధన, అభిషేకాదులు నిర్వహిస్తారు. శనివారం శ్రీమహావిష్ణువు ను పూజిస్తారు. పార్వతి మాతకు సైతం ఇష్టమైన మాసం శ్రావణం. అమ్మవారికి నిత్య పూజలు నిర్వహిస్తారు. ప్రతి మంగళవారం మంగళగౌరి వ్రతాలు ఆచరిస్తారు.

శ్రావణమాసం శ్రీమహావిష్ణువుతోపాటు ఆయన దేవేరి అయిన శ్రీమహాలక్ష్మికి అత్యంత ప్రీతికరమైనది. ఈ నెలలో వివిధరకాల పూజలు, వ్రతాలు ఆచరించడం వల్ల విశేష ఫలితాలు లభిస్తాయని భక్తులు నమ్ముతారు. పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మి వ్రతంగా జరుపుకుంటారు. ఒకవేళ ఆ రోజు వీలుకానివారు శ్రావణంలో వచ్చే మరో శుక్రవారం ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. శ్రావణ పౌర్ణమి రోజును రాఖీ పౌర్ణమిగా జరుపుకుంటారు. సోదర, సోదరీమణుల మధ్య ఆత్మీయ బంధానికి ప్రతీక. ఆరోజు సోదరీమణులు సోదరులకు రక్షలు కట్టి ఆశీర్వదిస్తారు. శ్రావణ పౌర్ణమి రోజున నూతన యజ్ఞోపవీత ధారణ చేస్తారు. శ్రావణ మాసం ప్రారంభోత్సవం సందర్భంగా భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేశారు.

శక్ద్వాదశి, దామోదర ద్వాదశి అని ఈ మాసంలో రెండు శుభ దినాలున్నాయి. శుక్ల పక్ష ఏకాదశి నాడు ఉపవాసం ఉండి మహావిష్ణువును పూజించినట్లయితే మోక్షం లభిస్తుందని భక్తులు నమ్ముతారు. కృష్ణపాడ్యమి, కృష్ణాష్టమి, హయగ్రీవ జయంతి, నాగపంచమి, కృష్ణపక్ష విదియ, రాఘవేంద్ర స్వామి ఆరాధన వంటి ముఖ్య తిథులూ ఈ నెలలోనే వస్తాయి. ఆధ్యాత్మిక మాసమయిన శ్రావణం మొత్తం పండుగ వాతావరణాన్ని తలపిస్తుంది.

సెల్ఫీల కోసం సాహసాలు చేయవద్దు

అక్షరటుడే, కామారెడ్డి: వర్షాలు కురుస్తుండడంతో పలు వాగులు ఉధృతంగా పారుతున్నాయని. వీటి వద్ద సెల్ఫీల కోసం ఎగబడి ప్రమాదాలు తెచ్చుకోవద్దని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. పాల్వంచ మండల కేంద్రంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల నదులు, వాగులు, వంకలు, చెరువులు పొంగి ప్రవహించి వంతెనల పైనుంచి నీరు ప్రవహించే అవకాశం ఉందని తెలిపారు. కాలి నడకన, వాహనాలతో ప్రజలు వాగులు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇలాంటి సమయంలో జాలర్లు, ప్రజలు చేపల వేటకు వెళ్లకూడదన్నారు. పశువులతో నదులు, వాగుల పరిసర ప్రాంతాల దగ్గరకు వెళ్లకూడదని సూచించారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఇప్పటికే వర్షాల కారణంగా ప్రమాదకరంగా మారుతున్న రహదారులు, చెరువులు, వాగులు, నదుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టిందని వివరించారు. ఆపదలో ఉన్న వారిని రక్షించడానికి జిల్లా పోలీస్ శాఖ తరపున 24 గంటలు తమ సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా అలర్ట్ చేశామని చెప్పారు. ఎవరికైనా విపత్కర పరిస్థితులు ఎదురైతే వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి సమాచారం అందించి పోలీసుల సేవలను పొందాలని కోరారు.

దీపావళిలోపు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి

అక్షరటుడే, ఇందూరు: అర్బన్ నియోజకవర్గంలో దీపావళి లోపు 3,500 డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేసి, అర్హులైన పేదలకు అందించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా.. ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇవ్వలేదని విమర్శించారు. అర్బన్‌లో సుమారు 40 వేల మంది పేదలు ఇల్లు లేని వారు ఉన్నారన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం నిత్యం తన క్యాంప్ ఆఫీస్‌కు 20 దరఖాస్తులు వస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకులు న్యాలం రాజు, ప్రవంతి రెడ్డి, నాగోల్ల లక్ష్మీనారాయణ, నారాయణ యాదవ్, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

వర్షం ఎఫెక్ట్.. తెగిన తాత్కాలిక రోడ్డు..

అక్షరటుడే ఇందల్వాయి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లింగాపూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఇందల్వాయి నుంచి ధర్పల్లి వెళ్లే రోడ్డును అధికారులు మూసివేశారు. లింగాపూర్ వాగుపై ఇప్పటికే వంతెన నిర్మాణం జరుగుతోంది. దీంతో వంతెన పక్కనే తాత్కాలికంగా రోడ్డు వేశారు. భారీ వర్షాలకు తాత్కాలిక రోడ్డు పైనుంచి వాగు పొంగి ప్రవహిస్తుండడంతో రోడ్డు తెగిపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. అయితే వాగులోనుంచి వెళ్లేందుకు ప్రయత్నించిన ఓ ట్రాక్టర్ అదుపుతప్పి వాగులో పడిపోయింది. అయితే ట్రాక్టర్ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఇందల్వాయి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను దారిమళ్లించారు.

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

అక్షరటుడే, భీమ్‌గల్: రైతులకు ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని డీపీవో, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలోని గ్రోమోర్ వ్యవసాయ ఎరువులు, విత్తనాల దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాల నిల్వలను పరిశీలించారు. రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని, వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. తనిఖీ అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ శాఖల పనులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు, వనమహోత్సవం తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఆయన వెంట ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్, తహశీల్దార్ షబ్బీర్, ఏవో లావణ్య, ఎంపీవో జావిద్, మెడికల్ ఆఫీసర్ అజయ్ ఉన్నారు.

కాటేపల్లి తండాలో ఉద్రిక్తత..

కబ్జాలను తొలగించిన అటవీశాఖాధికారులు

అక్షరటుడే, నిజాంసాగర్: పెద్ద కొడప్‌గల్ మండలంలోని కాటేపల్లి తండాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తండా శివారులోని 118, 275 సర్వే నంబర్లలో సుమారు 1700 ఎకరాల అటవీ భూమి ఉండగా, వీటిలో 70-80 ఎకరాల్లో తండావాసులు చదును చేసి పంటలు సాగు చేసుకుంటున్నారు. అటవీ భూమిని చదును చేయడంతో ఫారెస్ట్ అధికారులు తండాకు చేరుకుని, ఆక్రమిత భూముల్లో పంటలు ధ్వంసం చేశారు. ఈ మేరకు గురువారం జేసీబీలతో చేరుకుని పంటలను తొలగించారు. డివిజనల్ అటవీశాఖ అధికారిణి సునీత మాట్లాడుతూ.. 10 హెక్టార్లలో భూమిని చదును చేసి మొక్కలు నాటాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ మేరకు పోలీసు బందోబస్తుతో ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మిగిలిన 70 నుండి 80 ఎకరాల భూములను విడతల వారీగా ఆధీనంలోకి తీసుకుంటామన్నారు. అటవీ భూములు కబ్జా చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. పంటలు ధ్వంసం చేయడంతో తండావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

అక్షరటుడే, గాంధారి: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని.. బాగా చదువుకుని విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గాంధారిలోని కస్తూర్బా పాఠశాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం బాగుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం గురించి పాఠశాల ప్రిన్సిపాల్ శిల్పను అడిగారు. గతేడాది వందశాతం ఉత్తీర్ణత సాధించామని ఆమె పేర్కొనగా ఈ ఏడాది సైతం పూర్తిస్థాయి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రభుత్వ కళాశాలలోనూ పూర్తిస్థాయి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రేణుకా చావన్, ఎంపీడీవో రాజేశ్వర్, మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి

అక్షరటుడే ఇందూరు: ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వనమహోత్సవం, సీజనల్ వ్యాధుల నియంత్రణ తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో 51 లక్షలకు పైబడిన మొక్కలు నాటాల్సినందున లక్ష్యసాధనకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున అవసరమైన ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వర్షాల వల్ల ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. రైతులకు ఆయిల్ పామ్ సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలో 3,500 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేయాల్సి ఉండగా 1,242 ఎకరాల్లో మాత్రమే పంట సాగుకు రైతులు ముందుకు వచ్చారని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్ కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈత మొక్కలు నాటిన మండల ప్రత్యేకాధికారి

అక్షరటుడే, భీమ్‌గల్: మండలంలోని పురాణీపేట్‌లో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు గురువారం ఈత మొక్కలు నాటారు. గ్రామంలోని గౌడ సంఘం భూమిలో మొక్కలు నాటినట్లు తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎక్సైజ్ సీఐ వేణుమాధవ్, ఎస్ఐ, సిబ్బంది, ఉపాధిహామీ ఏపీవో నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి సంబరాలను సద్వినియోగం చేసుకోండి

అక్షరటుడే, భీమ్‌గల్: ఇందిరా మహిళా శక్తి సంబరాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాలెం నర్సయ్య సూచించారు. మండలంలోని పురాణిపేట్ గ్రామంలో మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. మహిళా శక్తి సంబరాల్లో భాగంగా ప్రభుత్వం మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు రూ.1.50 కోట్లు, శ్రీనిధి రుణాలు రూ. 52 లక్షలు, వడ్డీ రాయితీ రూ. 8.50 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ప్రభుత్వం మహిళలకు ఆదాయ మార్గాలు చూపించి వారి ఆర్థిక అభివృద్ధికి ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సురేందర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనంతరావు, పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య , మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

అక్షరటుడే, ఎల్లారెడ్డి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో రాజులు ఆదేశించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం కాంప్లెక్స్ స్కూల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజూ విద్యార్థుల డీఎస్సీ ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన వివరాలు, విద్యార్థుల హాజరు, ఎఫ్ఎల్ఎన్ వివరాలు, ఇతర అంశాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి కనీస సామర్థ్యాలైన చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు వెంకటేశ్వరరావు, యాదయ్య గారు, లింగమూర్తి, పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నగరంలో వాటర్ ట్యాంకర్ బోల్తా

నగరంలో ఓ వాటర్ ట్యాంకర్ రోడ్డుపై వెళ్తూ ఒక్కసారిగా బోల్తాపడింది. ఈ ఘటన ఆనంద్‌నగర్ కాలనీలో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. నగరంలోని ఆనంద్ నగర్ లోని పద్మశాలి సంఘం సమీపంలో ఇంటి నిర్మాణం కోసం మున్సిపల్ వాటర్ ట్యాంకర్‌ను తీసుకొచ్చారు. అది తిరిగి వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. **- అక్షరటుడే, ఇందూరు**

లింగంపేట మండలం ఎల్లమ్మ తండా సమీపంలో బస్సు ప్రమాదం(ఫైల్)

బస్సు ప్రమాదాలతో కలవరం

■ తరచూ ఆర్టీసీ బస్సు యాక్సిడెంట్లు ■ ఆందోళన చెందుతున్న ప్రయాణికులు

జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో ఆర్టీసీ బస్సులు సైతం ప్రమాదాలకు గురవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. రోడ్డు ప్రమాదాల నివార ణపై జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. అయినా ప్రమాదాలు చోటుచేసుకుంటుండడం కలవరపాటుకు గురిచేస్తోంది.

– అక్షరటుడే, లింగంపేట

ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తే సురక్షితంగా గమ్యస్థానానికి చేరుతారనే నమ్మకం ప్రయాణికుల్లో ఉండేది. కానీ ఇటీవల జరుగుతున్న ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత రెండు నెలల్లో కామారెడ్డి జిల్లాలోనే మూడు ప్రమాదాలు జరిగాయి. కాగా.. అద్దె బస్సులతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నా.. చెడ్డపేరు మాత్రం ఆర్టీసీకే వస్తోంది. ప్రమాదాల కారణంగా ఆర్టీసీ ప్రతి ఏడాది రూ. కోట్లల్లో నష్టం పరిహారం కింద చెల్లించాల్సి వస్తోంది.

బస్సుల నిర్వహణపై నిర్లక్ష్యం

ఆర్టీసీ బస్సుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వహిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. నిర్వహణ సక్రమంగా ఉండకపోవడమూ ప్రమాదాలకు కొంత వరకు కారణం అవుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా.. ప్రమాదాలు ఎక్కువగా ప్రైవేటు బస్సుల కారణంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు బస్సుల డ్రైవర్లకు ఆర్టీసీ రెగ్యులర్ డ్రైవర్ల తరహాలో పూర్తిస్థాయి అనుభవం లేకపోవడం కూడా ప్రమాదాలు జరిగేందుకు కారణమవుతున్నాయనే పలువురు పేర్కొంటున్నారు. ఏదిఏమైనా ఆర్టీసీ బస్సులు ప్రమాదాలకు గురికావడం ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇటీవల జరిగి ప్రమాదాలివే..

1) లింగంపేట మండల కేంద్రంలో నెలరోజుల క్రితం ఓ విద్యార్థి ఆర్టీసీ బస్సులో నుంచి కిందపడి ప్రాణాలతో బయటపడ్డాడు. ఆ బస్సు మూలమలుపు వద్ద వేగాన్ని డ్రైవర్ కంట్రోల్ చేయకపోవడంతో బాలుడు కిందపడ్డాడని సమాచారం.

2) లింగంపేట మండలం ఎల్లమ్మ తండా సమీపంలో ఈనెల 19న కల్వర్టుపైన ఆర్టీసీ బస్సు ఇసుక లారీ ఢీకొనడంతో 8 మంది మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఇసుక లారీ, బస్సు పోటాపోటీగా వెళ్లడం వల్లే ప్రమాదం జరిగిందని.. బస్సులో 100 మంది వరకు ప్రయాణికులు ఉన్నప్పుడు డ్రైవర్‌కు ఓపిక ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని ప్రయాణికులు పేర్కొన్నారు.

3) రెండు నెలల క్రితం రాజంపేట మండల కేంద్ర సమీపంలోని ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు.

ఇంటర్ కళాశాలను సందర్శించిన నోడల్ అధికారి

అక్షరటుడే, గాంధారి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు పరిశీలించారు. అధ్యాపకుల బోధనాతీరును పరిశీలించి.. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలని అధ్యాపకులకు సూచించారు. విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత శాతం సాధించేలా కృషి చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం, అధ్యాపకులు లక్ష్మణ్, రాజగోపాల్, విజయ్ కుమార్, సంబాజీ, సుజాత, శ్రీధర్, తదితరులున్నారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

అక్షరటుడే, ఆర్మూర్ : ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాం సాగర్ కు స్వల్పంగా ఇన్‌ఫ్లో పెరిగింది. స్థానికంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జలాశయంలోకి వరద నీరు వస్తోంది. నిజామాబాద్, నిర్మల్ జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి 2,579 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 277 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్‌లోకి భారీ వరద రాకపోవడంతో నీటిమట్టం నిలకడగా ఉంది. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా గురువారం ఉదయానికి 1068.80 (21.369 టీఎంసీలు) అడుగులకు నీరు ఉంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్ట్‌లో 24.376 టీఎంసీల నీరు ఉండటం గమనార్హం. గతేడాది ఈ సమయానికి ప్రాజెక్ట్‌లోకి వరదలు ప్రారంభం అయ్యాయి. గోదావరిపై ఎగువన మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లను జులై 1న సుప్రీం కోర్టు తీర్పు మేరకు అధికారులు ఎత్తారు. అయితే ఎగువన వర్షాలు లేకపోవడంతో బాబ్లీ నుంచి ఎలాంటి వరద రావడం లేదు. స్థానికంగా కురుస్తున్న వర్షాలతోనే జలాశయంలోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నీటి మట్టం 60 టీఎంసీలు చేరిన తర్వాతే పంటలకు సాగు నీరు విడుదల చేసే అవకాశం ఉంది. ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు విడుదల చేయాలని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఇప్పటికే ఎస్ఈ శ్రీనివాస్ గుప్తాను కోరారు.

సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అక్షరటుడే, కామారెడ్డి: సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మి చెక్కులను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు 178 సీఎం రిలీఫ్ ఫండ్, 251 కల్యాణలక్ష్మి చెక్కులను ఆయా మండల కేంద్రాల్లో, గ్రామ రైతు వేదికలలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం చేస్తున్న ఆర్థికసాయం నేరుగా లబ్ధిదారుల వద్దకే వెళ్లి అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో కామారెడ్డికి వచ్చి గంటల తరబడి వేచి చూసే విధానానికి స్వస్తి పలికినట్లు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో అనారోగ్యం బారిన పడిన ప్రజలు డిశ్చార్జ్ తర్వాత ఆస్పత్రి ఒరిజినల్ బిల్లులు తమ కార్యాలయంలో అందజేస్తే ప్రభుత్వం నుంచి సీఎం రిలీఫ్ ఫండ్ వచ్చేలా చూస్తానని చెప్పారు.

కులాస్‌పూర్‌లో దొంగల బీభత్సం.. పదిళ్లలో చోరీ

అక్షరటుడే, నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలంలో దొంగలు బీభత్సం సృష్టించారు. బుధవారం రాత్రి ఏకంగా పదిళ్లలో చోరీలకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కులాస్‌పూర్‌లో బుధవారం రాత్రి దొంగల ముఠా తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని పాల్పడింది. ముఠా సభ్యులు రాత్రి పదిళ్లలో చోరీలు చేశారు. సుమారు 5 తులాల బంగారం.. రూ. 2లక్షలకు పైగా నగదు చోరీకి గురైనట్లు సమాచారం. పక్కన ఉన్న ఇళ్లకు బయటి నుంచి గడియ పెట్టి దుండగులు చోరీలు చేసినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకుని విచారణ చేస్తున్నట్లు మోపాల్ సీఐ సురేష్ పేర్కొన్నారు.

'శ్రీచైతన్య'లో తరగతుల నిర్వహణకు డీఈవో అనుమతి నిరాకరణ

అక్షరటుడే, బాన్సువాడ: పట్టణంలోని వీక్లీ మార్కెట్ వద్ద శ్రీచైతన్య స్కూల్‌ను అనుమతులు లేకుండానే ప్రారంభించారు. నర్సరీ నుంచి 7వ తరగతి వరకు క్లాసుల నిర్వహణకు అనుమతి కోరుతూ చేసిన ప్రతిపాదనను జిల్లా విద్యాధికారి అధికారి రాజు తిరస్కరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు పాఠశాల ప్రతినిధులు చేసిన అభ్యర్థనను పునఃసమీక్షించిన అనంతరం డీఈవో ఈ నిర్ణయం తీసుకున్నారు. 2025-26కు గాను అనుమతుల కోసం గడువు ముగిసిన తర్వాత దరఖాస్తు చేశారని, 2022లో ఫారం-A ఆధారంగా 2025-26కి అనుమతి చట్టపరంగా సాధ్యం కాదన్నారు. దరఖాస్తులో సమర్పించాల్సిన పలు డాక్యుమెంట్లు జత చేయని కారణంగా అనుమతి ఇవ్వడం లేదని ప్రొసీడింగ్ జారీ చేశారు. పాఠశాల భవనం నిర్మాణ దశలో ఉందని, తరగతులు నిర్వహించడానికి అనుకూలంగా లేదన్నారు. 2022 అక్టోబర్‌లో చెల్లించిన చలాన్‌కు గడువు ముగిసిపోయిందన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని స్కూల్‌కు 2025-26 విద్యా సంవత్సరానికి గుర్తింపు ఇవ్వలేమని చెప్పారు. తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, గుర్తింపు పొందిన పాఠశాలలోనే చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

అక్షరటుడే, కామారెడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చాలని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. భారతీయ కిసాన్ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు మాట్లాడుతూ.. రుణమాఫీ కాని రైతులకు రూ.2లక్షల వరకు మాఫీని వెంటనే అమలు చేయాలన్నారు. వరిధాన్యం, మొక్కజొన్న, కందులు, సోయాబీన్స్, పత్తి, మిర్చి, పసుపు, ఎర్రజొన్న, చెరుకు పంటలకు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు ప్రతి ఎకరానికి రూ. 15వేలు రైతు భరోసా చెల్లిచాలన్నారు. రాష్ట్రంలో పీఎం ఫసల్ బీమాను అమలు చేయాలని కోరారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రతి జిల్లాలో ఒక విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని, సబ్సిడీపై రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలను అందించాలని డిమాండ్ చేశారు. అలాగే పండ్ల తోటల రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు గంగారెడ్డి, మహిపాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, బీజేపీ నాయకులు నరేందర్ రెడ్డి, లింగారావు, రవీందర్, రాజ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

లింబాద్రి గుట్ట ఆలయ హుండీ లెక్కింపు

అక్షరటుడే, భీమ్ గల్: భీమ్ గల్ లింబాద్రి లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదాయం రూ. 8,28,642 వచ్చినట్లు ఆలయ ధర్మకర్త నంబి పార్థసారధి తెలిపారు. నిజామాబాద్ దేవాదాయ శాఖ కమిషనర్ విజయ రామారావు ఆధ్వర్యంలో చేపట్టిన హుండీ లెక్కింపులో దేవాలయ హుండీ ద్వారా రూ. 5,94,737, అన్నదాన హుండీ ద్వారా రూ. 2,33,905 సమకూరినట్లు చెప్పారు. ఇందులో నుంచి రూ. 4,69,112 ప్రభుత్వ నిధులకు జమ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పీఆర్సీని తక్షణమే అమలు చేయాలి

అక్షరటుడే, ఇందూరు: గతేడాది జూలై నుంచి అమలు కావాల్సిన పీఆర్సీని ఇప్పటివరకు అమలు చేయకపోవడం శోచనీయమని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ధర్మేందర్, శ్రీకాంత్ అన్నారు. గురువారం నగరంలోని ఆయా పాఠశాలల్లో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏడాది గడిచినా పీఆర్సీని అమలు చేయలేదని, ప్రభుత్వం పెండింగ్ బిల్లు లను చెల్లించాలని డిమాండ్ చేశారు. పదోన్నతులు ఇవ్వడంలో ఇబ్బందులు ఉంటే.. అడ్‌హాక్ పదోన్నతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ కార్యదర్శి మల్లయ్య అఫ్జల్ బేగ్, జిల్లా సహాధ్యక్షుడు కాంతారావు, ఉపాధ్యక్షులు సాయిబాబా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అక్షరటుడే, ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లి శివారులో రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. రైల్వే ట్రాక్ సమీపంలోని ఓ గుంతలో కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి ఒంటిపై తెలుపు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. సంబంధీకులు ఉంటే ఇందల్వాయి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.